సాక్షి తిరుపతి

శనివారం । 19 । ఏప్రిల్ । 2025



ఉపాధికి షార్ట్ కట్

పాలిటెక్నిక్ కోర్సులు ఉపాధికి బాటలు వేస్తున్నాయి. అంతరిక్ష పరిశోధన సంస్థ షార్‌లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. - 10లో



12 కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతిలో 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. - 10లో



టీటీడీకి పది టన్నుల కూరగాయలు

పలమనేరు మార్కెట్ మండీ యజమాని టీటీడీకి పది టన్నుల కూరగాయలను వితరణగా అందజేశారు. - 10లో

న్యూస్‌రీల్

నేడు ఈ-వేస్ట్ సెంటర్ల ఏర్పాటు

తిరుపతి అర్బన్: జిల్లాలోని పంచాయతీల పరిధిలో ఈ-వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు)సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి శుక్రవారం తెలిపారు. శనివారం నుంచి ఇవేస్ట్ సెంటర్లు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. అయితే మండల కేంద్రాలుగా ఉన్న పంచాయతీలు, 10 వేలకు మించి జనాభా ఉన్న పంచాయతీల్లో ఏర్పాటు చేయనున్నట్టు ఆమె స్పష్టం చేశారు.

ఏపీపీఎస్సీ పరీక్షల్లో తిరుపతి రచయితపై ప్రశ్న



ఆర్‌సీ.కృష్ణస్వామి రాజు రచించిన జక్కదొన కథల పుస్తకం

తిరుపతి కల్చరల్: ఏపీపీఎస్సీ ఈనెల 4వ తేదీ నిర్వహించిన పరీక్షల్లో తిరుపతి జిల్లాకు చెందిన రచయిత ఆర్‌సీ.కృష్ణస్వామి రాజుపై ఒక ప్రశ్న రావడం విశేషం. పేపర్ -1 జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ ప్రశ్నపత్రంలో 31వ ప్రశ్నలో ఆయన రచించిన 'జక్కదొన' పుస్తక రచయిత ఎవరు? అని బహుళైచ్ఛిక ప్రశ్నగా అడిగారు. ఈ పుస్తకంలోని జక్కదొన కథ పాత చిత్తూరు జిల్లాలోని వెదురుకుప్పం మండలం, జక్కదొన గ్రామం ప్రధానాంశంగా సాగుతోంది. ఆ ఊరు పులికంటి కృష్ణారెడ్డి సొంత ఊరు కావడం గమనార్హం. ఆయనకు ఈ పుస్తకాన్ని రచయిత రాజు అంకితమిచ్చారు. గత ఏడాది అక్టోబర్‌లో ఈ పుస్తకాన్ని ఎస్వీయూ సెనేట్ మందిరంలో ఆవిష్కరించారు. మొత్తం 21 కథల సంకలనమైన ఈ పుస్తకంలో అన్ని వర్గాలకు చెందిన వారిని పరిచయం చేశారు రచయిత.

నేడు తిరుమలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

తిరుమల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తిరుమలలో సామూహిక శ్రమదానాన్ని టీటీడీ నిర్వహించనుంది. తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో టీటీడీ అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అలిపిరి నడక దారిలోని కుంకాల పాయింట్ (ఆఖరి మెట్టు) వద్ద నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

కళ్యాణ కట్టలో టీటీడీ చైర్మన్ తనిఖీలు



భక్తులతో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్

తిరుమల : తిరుమల శ్రీవారికి భక్తులు తలనీలాలు సమర్పించే కళ్యాణ కట్ట, నందకం మినీ కళ్యాణ కట్టలో శుక్రవారం సాయంత్రం టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు ఆకస్మిక తనిఖీలు చేశారు. భక్తుల తలనీలాల సమర్పణను క్షేత్రస్థాయిలో పరిశీలించి క్షురకుల ప్రవర్తనపై అభిప్రాయాలను భక్తుల నుంచి తెలుసుకున్నారు. ఒక ప్రాంతంలోని కళ్యాణకట్టలో రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు రద్దీ తక్కువగా ఉండే కళ్యాణకట్టకు భక్తులు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, నరేష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

16వ ఆర్థిక సంఘం బృందానికి సాదర వీడ్కోలు




విమానాశ్రయంలో 16వ ఆర్థిక సంఘం చైర్మన్, సభ్యులతో జిల్లా కలెక్టర్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): జిల్లాలో రెండు రోజుల పర్యటన ముగించుకొని శుక్రవారం ఉదయం ఢిల్లీకి తిరుగు పయనమైన 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డా.అరవింద్ పనగారియా, సభ్యులు అన్నే జార్జ్ మ్యాథ్యూ, డా.మనోజ్ పాండా, రిత్విక్ పాండే, కేకే మిశ్రా, అమృత, ఆదిత్య పంత్ తదితర సభ్యులతో కూడిన బృందానికి రేణిగుంట విమానాశ్రయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రిన్సిపల్ సెక్రటరీ (ఫైనాన్స్) పీయూష్ కుమార్, జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, సంబంధిత అధికారులు 16వ ఆర్థిక సంఘం బృందానికి సాదర వీడ్కోలు పలికారు.

సంస్కరణలే పెట్టుబడి!

2019–24 మధ్య కాలంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేశారు. పిల్లలకు విలువలతో కూడిన విద్యనందించాలని పరితపించారు. ఈ క్రమంలోనే విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. విద్యాభివృద్ధితోనే వ్యక్తిగత, సామాజిక ప్రగతి సాధ్యమవుతుందని బలంగా విశ్వసించారు. నాటి సంస్కరణల ఫలితంగానే నేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు వచ్చాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఇంటర్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి సన్‌షైన్ అవార్డులకు ఎంపికైన విద్యార్థుల మనోగతంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



జిల్లా సమాచారం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు (జనరల్ + ఒకేషనల్)	20
ఎయిడెడ్ జూనియర్ కళాశాల	1
మోడల్ స్కూల్స్	5
కేజీబీవీలు	5
హైస్కూల్ ప్లస్	39
మొత్తం కళాశాలలు	70
ప్రథమ, ద్వితీయ సంవత్సరం బాలురు	12,968
ప్రథమ, ద్వితీయ సంవత్సరం బాలికలు	13,347
మొత్తం విద్యార్థులు	26,315

ఇంటర్‌లో ప్రతిభ చాటిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు

గత ప్రభుత్వ సంస్కరణలతోనే నేడు ఉత్తమ ఫలితాలు

వైఎస్సార్‌సీపీ పాలనలోనే విద్యకు అధిక ప్రాధాన్యం

సన్‌షైన్ అవార్డులు స్వీకరించిన జిల్లా విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : గత ఐదేళ్ల పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ఒక్క చదువుతోనే పేదరికాన్ని అధిగమించగలమని బలంగా నమ్మింది. ఇందులో భాగంగానే ప్రభుత్వ విద్యారంగాన్ని గాడిలో పెట్టింది. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు అమ్మఒడి, విద్యాకానుక, నాడు–నేడు పథకాలను అమలుచేసి ఉన్నత చదువులకు బాటలు వేసింది.

నాటి సంస్కరణలతోనే..

వైఎస్సార్‌సీపీ పాలనలో అమలు చేసిన సంస్కరణలే నేడు ఇంటర్మీడియెట్ ఉత్తమ ఫలితాలకు దోహదం చేశాయి. జిల్లా వ్యాప్తంగా 34 మండలాల్లో 70 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఆయా కళాశాలల్లో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేపట్టారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల డిమాండ్లు పరిష్కరించారు. బూజుపట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలను నాడు–నేడు పథకం ద్వారా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు.

సన్‌షైన్ అవార్డులు

కోట హైస్కూల్ ప్లస్‌కు చెందిన యనమల శివాని ఎంపీసీ లో 978 మార్కులు సాధించింది. పుత్తూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఒకేషనల్ సీఎస్‌ఈ చదివిన కమలశ్రీ 987, ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మెకానికల్ ఆటో మొబైల్ టెక్నీషియన్ (ఎం అండ్ ఏటీ) ఒకేషనల్ కోర్సు చదివిన ఎ.ఎ.ప్రేమ్‌కుమార్ 977, దొరవారిసత్రం కేజీబీవీలో పీఎస్‌టీటీ ఒకేషనల్ కోర్సు చదివిన నక్కబోయిన లహరి 969 మార్కు లు సాధించారు. వీరందరూ ఈ నెల 15న విజయవాడలో మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లు అందుకున్నారు.

పేదింట మెరిసిన విద్యాకుసుమం



కోట: కోట మండలం, కేసవరం పంచాయతీ, సిద్ధమ్మకండ్రిగ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, రాధ కుమార్తె శివానీ. కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్లస్ టూలో ఎంపీసీలో చేరింది. వెయ్యి మార్కులకు గాను 978 మార్కులు సాధించి సన్‌షైన్ అవార్డు సొంతం చేసుకుంది. గతంలో చిట్టేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో 527 మార్కులు సాధించింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 470కి 456 మార్కులు సాధించింది.

తండ్రి కష్టం వృథాపోకూడదని..!



చిత్తూరు జిల్లా, నగరి మండలం, సత్రవాడ గ్రామానికి చెందిన ఎకె.ఆరస్వామి, ఎకె.త్యాగవల్లి కుమారుడు ఎకె.ప్రేమ్‌కుమార్ పుత్తూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మెకానికల్ ఆటో మొబైల్ టెక్నీషియన్ (ఎం అండ్ ఏటీ)లో ఒకేషనల్ విద్యనభ్యసించాడు. ఇంటర్‌లో 977 మార్కులు సాధించి సన్‌షైన్ అవార్డు అందుకున్నాడు. తండ్రి మగ్గం కార్మికుడు. చిన్న పరిశ్రమలో దినసరి కూలీ. వచ్చే కూలీ డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటూ తన ముగ్గురు కుమారులను చదివించాడు. చిన్న కుమారుడైన ప్రేమ్‌కుమార్ తండ్రి కష్టం వృథా పోకూడదన్న సంకల్పంతో చదువుకుంటున్నాడు. బీటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్‌లో స్థిరపడి తల్లిదండ్రుల కష్టానికి ఫలితమివ్వాలన్నదే తన లక్ష్యమని అంటున్నాడు.

తండ్రి కష్టాన్ని గుర్తుచేసుకుంటూ..



నారాయణవనంకు చెందిన ఎంపి.మదనాచారి, ఎం.భువనేశ్వరి దంపతుల కుమార్తె కమలశ్రీ. పుత్తూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇం.ఇజినీరింగ్ (సీఎస్ఈ) ఒకేషనల్ విద్యనభ్యసించి 987 మార్కులు సాధించి సన్‌షైన్ అవార్డుకు ఎంపికై ంది. విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించింది. రెక్కాడితే గానీ డొక్కాడని పేదరికం వారిది. తండ్రి కూలి పని చేస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. తన తండ్రి కష్టాన్ని చూస్తూ పెరిగిన కమలశ్రీ అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. బీకాం కంప్యూటర్స్ లేదా బీసీఏ డిగ్రీ కోర్సు చదివి సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడాలన్నదే తన ఆకాంక్ష అని చెబుతోంది.

ఐఏఎస్ కావాలన్నదే లక్ష్యం



బుచ్చినాయుడుకండ్రిగ మండలం, పార్లపల్లి గ్రామానికి చెందిన ఎస్.ఆనందయ్య, ఎస్.బుజ్జమ్మ దంపతుల కుమార్తె నక్కబోయిన లహరి దొరవారిసత్రం కేజీబీవీలో ప్రీస్కూల్ టీచర్ ట్రైనింగ్ ఒకేషనల్ కోర్సును పూర్తిచేసింది. ఇంటర్‌లో 969 మార్కులు సాధించి, సన్‌షైన్ అవార్డు స్వీకరించింది. తల్లిదండ్రులు కూలినాలి చేసుకుంటూ వచ్చే సంపాదనతోనే కుటుంబాన్ని పోషిస్తూ ముగ్గురు పిల్లలను చదివిస్తున్నారు. వీరిలో మొదటి వాడు శ్రీకాళహస్తిలో డిగ్రీ, రెండో అమ్మాయి లహరి ఇంటర్‌లో ప్రతిభ చాటగా, మూడవ అమ్మాయి 7వ తరగతి చదువుతోంది. బీఏ డిగ్రీ పూర్తి చేసి సివిల్స్‌కు సిద్ధమవ్వడమే లక్ష్యమని చెబుతోంది.

• క్రీస్తు త్యాగం.. పాప విమోచనం



తిరుపతి జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు గుడ్ ఫ్రైడేని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. యేసు క్రీస్తు శిలువ మరణం పొందిన విధానాన్ని పాస్టర్లు వివరించారు. క్రీస్తు చూపించే ప్రేమ, దయ, జాలి, కరుణ మహోన్నతమైనవని కొనియాడారు. క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. – తిరుపతి కల్చరల్

తిరుచ్చిపై సిరులతల్లి విహారం



ఊరేగుతున్న అమ్మవారు

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతీదేవి శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై మాడవీధుల్లో విహరించారు. అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మురిపించే వర్ణం.. వకుళామాత పరవశం!



తిరుపతి జిల్లాలో గత రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ మండిపోతోంది. ఆ తర్వాత ఆకాశం మేఘావృతమవుతోంది. మబ్బుల మాటున సూరీడి కిరణాలు విభిన్న వర్ణాలతో ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం చంద్రగిరి రూరల్ పరిధిలోని పేరూరు బండపై వెలసిన శ్రీవకులామాత ఆలయం ఎర్రటి మబ్బుల నీడలో శోభాయమానంగా వెలుగొందుతూ భక్తులను ఆకట్టుకుంది. ఈ సుందర దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

గోవులంటే చులకనెందుకో?

- గోవుల మృతిని సీరియస్‌గా తీసుకోని బీజేపీ
- గోవులు మృతి చెందాయన్న వారిపై ఎదురుదాడి
- సుబ్రమణ్యంస్వామి హెచ్చరికలతో ఆత్మరక్షణలో కూటమి నేతలు
- గోవుల మృతిపై హిందూ సంఘాలు ఎందుకు స్పందించడం లేదో?

సాక్షి, టాస్క్‌ఫోర్స్: హిందువులు అత్యంత పవిత్రంగా భావించే గోమాతల మృతిపట్ల కూటమి నేతలు వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా బీజేపీ నేతలు గోవుల మృతిని సీరియస్‌గా తీసుకోకపోగా.. మరణాలను బయటపెట్టిన వారిపై కేసులు పెట్టించడాన్ని హిందువులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఇంతజరుగుతున్నా హిందూ సంఘాలు ఏమయ్యాయని జనం ప్రశ్నిస్తున్నారు. టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చెప్పిన విషయాలు నిజమా? కాదా? అనే విషయాన్ని నిగ్గుతేల్చేందుకు యత్నించాల్సిన బీజేపీ నేతలు తలోమాట మాట్లాడడంపై మండిపడుతున్నారు. బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యం స్వామి గోవుల మృతిపై తీవ్రంగా స్పందించడంతో పాటు.. ఈ విషయంపై త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు స్పష్టం చేయడంతో కూటమి నేతలు ఆత్మరక్షణలో పడ్డారు.

ఎందుకు స్పందించడంలేదో?

టీటీడీ గోశాలలో గోవులు మృతి చెందాయని వైఎస్సార్‌సీపీ అధికారప్రతినిధి భూమన కరుణాకరరెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. నాటి నుంచి నేటి వరకు కూటమి నేతలు, టీటీడీ చైర్మన్, ఈఓ తలోమాట.. తలోరకంగా ప్రకటనలు చేస్తున్నారు. బీజేపీ నేతలు టీటీడీ గోవుల మృతి ఘటనను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోకపోవడంపై పలువురు మండిపడుతున్నారు. హిందూ సంఘాలు అని చెప్పుకునే వారు సైతం గోవుల మృతి ఘటనపై స్పందించకపోవడంపై విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతినెలా అన్ని గోవులు మృతి చెందుతాయా?

టీటీడీ గోశాలలో 1,800 గోవులు ఉన్నట్లు సమాచారం. వృద్ధాప్యం కారణంగా ప్రతి నెలా గోవులు మృతి చెందుతున్నాయని కూటమి నేతలు, టీటీడీ ఈఓ ప్రకటించారు. వృద్ధాప్యం కారణంగా ప్రతినెలా 15 గోవులు మరణించడం ఏమిటని 'గో' ప్రేమికులు ప్రశ్నిస్తున్నారు. ఈ లెక్కన పదేళ్లలో గోశాలలోని గోవులన్నీ మరణించి ఉండాలి కదా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. పశువైద్యుల అంచనా ప్రకారం వాటి సహజ మరణాల రేటు 3 శాతం మాత్రమే ఉంటుందని చెబుతున్నారు. ఈ లెక్కన వెయ్యి పశువులు ఉంటే.. అందులో వృద్ధాప్యం వల్ల ఏడాదికి 30 మాత్రమే మరణిస్తాయని వివరించారు. ఆ లెక్కన గోశాలలో మరణించే పశువుల సంఖ్య ఏడాదికి 60కి మించే ప్రసక్తిలేదంటున్నారు. మూడు నెలల కాలంలో 43 గోవులు మృతి చెందినట్లు ఈఓ ప్రకటించడం ఆందోళన కలిగించే విషయమని చెబుతున్నారు.

ఎప్పుడు ఏం జరిగిందంటే..

- టీటీడీ గోశాలలో వందకుపైగా గోవులు మృతి చెందాయి. (ఈనెల 11న టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆరోపణ)
- గోవులు మృతి చెందాయంటూ వస్తున్న వార్తలు అవాస్తవం (ఈనెల 11న టీటీడీ విడుదల చేసిన ప్రకటన)
- తిరుమల గోశాలలో ఆవులు చనిపోయాయని అపద్ధాలు చెబుతున్నారు. (ఈనెల 14న గుంటూరు జిల్లా పొన్నేకల్లులో సీఎం చంద్రబాబునాయుడు ఉద్ఘాటన)
- ప్రతి నెలా సగటున 15 గోవులు మరణిస్తుంటాయి. మూడు నెలల్లో 43 గోవులు మృతి చెందాయి. అన్నీ సహజ మరణాలే. (టీటీడీ ఈఓ శ్యామలరావు ఈనెల 14న మీడియా సమావేశంలో వెల్లడి)
- టీటీడీ గోశాలలో 20 నుంచి 22 గోవులు మృతి చెంది ఉండొచ్చు. వృద్ధాప్యం కారణంగానే మృతి చెందాయి. (టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఈనెల 13న ఎస్వీ గోశాల మీడియా సమావేశంలో..)
- ఎస్వీ గోశాలలో 40 గోవులే మృతి చెందాయి. అయితే అవన్నీ అనారోగ్యంతోనే మృతి చెందాయి. (తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఈనెల 12న మీడియా సమావేశంలో..)
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, భూమన కరుణాకరరెడ్డి గోశాలకు వచ్చి గోవులు మృతిచెందాయని నిరూపించాలి (ఈనెల 16న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ట్వీట్)
- మీ సవాల్‌ని స్వీకరిస్తున్నా.. 17న ఉదయం 10 గంటలకు టీటీడీ గోశాలకు కచ్చితంగా వస్తున్నా.. మీరూ రండి. (టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఈనెల 16న రీ ట్వీట్)

అదే రోజు అర్ధరాత్రి నుంచి పోలీసులను రంగంలోకి దింపి వైఎస్సార్‌సీపీ శ్రేణులందరినీ హౌస్ అరెస్ట్ చేసి గోశాలకు రాకుండా నిర్బంధించారు. ఆపై తమ ఎల్లో మీడియా ద్వారా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై విషప్రచారం చేయడం ప్రారంభించారు.



సరిచేసుకోవడం మాని..!

టీటీడీ గోశాలలో గోవులు మృతి చెందుతున్నాయని భూమన చెప్పిన విషయంలో నిజమో? కాదో? విచారించాలి. నిజమే అయితే వెంటనే గోవులు మృతి చెందకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అది మానేసి.. నిజాలు చెప్పిన వారిపై ఎదురుదాడి చేయడం, తలో ప్రకటన చేసి టీటీడీ ప్రతిష్టను దిగజార్చేలా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. సవాల్ విసిరి.. వస్తామన్న వారిని పోలీసుల చేత అడ్డుకోవడం.. ఆ తరువాత వైఎస్సార్‌సీపీ వాళ్లే రాలేదని అసత్య ప్రచారం చేయడంపై కూటమి నేతలే అసహ్యించుకుంటున్నారు. గోవుల మృతి విషయంలో తమ పార్టీ నేతలు అవగాహన లేకుండా మాట్లాడి అభాసుపాలయ్యారని కూటమి శ్రేణులు చర్చించుకుంటున్నారు.

టీటీడీపై రాజకీయం తగదు



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుపతి కల్చరల్ : ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది విశ్వసించే టీటీడీపై రాజకీయం తగదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఆయన మాట్లాడారు. ఎస్వీ గోశాలను రాజకీయ వేదికగా మార్చవద్దని కోరారు. ఈ క్రమంలోనే న్యాయవ్యవస్థను ధ్వంసం చేసేందుకు బీజేపీ యత్నిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు ఉప రాష్ట్రపతి జగదీష్ ధన్కర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను గవర్నర్లుగా నియమించి రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని మండిపడ్డారు. తమిళనాడు గవర్నర్ తీరుని సుప్రీం కోర్టు సైతం తప్పు పట్టిందని విమర్శించారు. రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్‌తో కూటమి ప్రభుత్వం ఆడుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా వేధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌ను కాపాడేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నేతలు రామానాయుడు, శివారెడ్డి, మురళి, చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, విశ్వనాథ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

12 కిలోల గంజాయి స్వాధీనం

- ఐదుగురి అరెస్ట్

తిరుపతి లీగల్/తిరుపతి క్రైమ్: అక్రమంగా గంజాయి కలిగిన కేసులో ఐదుగురికి మే ఒకటో తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీచేశారు. అన్నమయ్య జిల్లా, పెద్ద తిప్పసముద్రం మండలం, పులికల్లుకు చెందిన సీ.కార్తీక్, ములకలచెరువు మండలం, పెద్దపల్లికి చెందిన ఎద్దుల హరి, కురబలకోట మండలం, మట్లీవారిపల్లికి చెందిన ఆర్.హరినాథ్ అలియాస్ హరీష్, పెద్దతిప్పసముద్రం మండలం, వరికశువుపల్లికి చెందిన చిన్నరెడ్డి వారి దిలీప్ రెడ్డి, వైఎస్సార్ కడప జిల్లా, పులివెందుల, ఎస్‌బీఐ కాలనీకి చెందిన వీ.జీవన్‌కుమార్లు కలిసి తిరుపతి, సీతమ్మనగర్ ప్రాంతంలో 12 కిలోల గంజాయి అక్రమంగా కలిగి ఉండగా ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు వారిని అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరపరిచారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తిరుపతి క్రైం : ఓ గుర్తు తెలియని వ్యక్తి కృష్ణాపురం టానా వద్ద మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వెస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుమారు 65 నుంచి 70 సంవత్సరాలు గల వృద్ధుడు కృష్ణాపురం టానా వద్ద మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించామన్నారు. వృద్ధుడు ఆచూకీ తెలిస్తే వెస్ట్ పోలీసులను సంప్రదించాలన్నారు. వృద్ధుడిని చూస్తే ప్రాథమికంగా యాచకుడిగా భావిస్తున్నామన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధుడి మృతి

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌లోని రెండో నంబర్ ప్లాట్‌ఫారంపై శుక్రవారం సుమారు 60 నుంచి 65 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే వారు మృతి దేహాన్ని స్వాధీనం చేసుకుని, స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని వద్ద ఎలాంటి సమాచారం లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రేల్వే ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరింది. బుధవారం అర్ధరాత్రి వరకు 56,279 మంది స్వామివారిని దర్శించుకోగా 24,019 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.59 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఉపాధికి షార్ట్‌కట్



పది పరీక్షలు ముగిశాయి.. ప్రభుత్వ కళాశాలల్లో అరకొర సౌకర్యాలు.. అందని మాధ్యమిక విద్య..ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ అంటే రూ.లక్షల వ్యయం .. ఎలా చేయాలని చింతిస్తున్నారా?. అవసరం లేదు. తక్కువ సమయం, ఖర్చుతో ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సు చేస్తే ఉన్నత ఉద్యోగం.. వద్దనుకుంటే ఉన్నత విద్యకు మార్గం సుగమం.. భవితకు భరోసా. ఉన్నత జీవనానికి చింతలేనిది పాలి'టెక్నిక్'. అందులోనూ అతి వల ఉజ్వల భవితకు షార్ట్ కట్. దీనిపై ప్రత్యేక కథనం.

- పది తర్వాత కొలువుకు దగ్గర మార్గంలా పాలిటెక్నిక్ కోర్సులు
- డీసీసీపీ కోర్సుతో ఉద్యోగ అవకాశాలు మెండు
- శ్రీహరికోట షార్‌లో మంచి డిమాండ్
- అప్రెంటిస్‌షిప్ పూర్తితో ప్రైవేటు రంగాల్లో ఆఫర్లు



డీసీసీపీ కోర్సులో కంప్యూటర్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినిలు



విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం(ఫైల్)

పలమనేరు: పాలిటెక్నిక్ కోర్సులు పదో తరగతి తరువాత తక్కువ ఖర్చు, సమయంలో ఉపాధి అవకాశాలు పొందడానికి దోహదపడతాయి. ఈ నేపథ్యంలోనే పదో తరగతి పూర్తయ్యాక పాలిసెట్ రాసే విద్యార్థులు.. పాలిటెక్నిక్ అంటే బీటెక్‌కు సులభమైన దారిగానే భావిస్తుంటారు. చాలామంది ఈ కోర్సులో బ్రాంచ్‌లైన సివిల్, మెకానికల్, ఈసీఈ, ఈఈఈ, సీఎస్ఈ వైపే చూస్తుంటారు. స్పెషల్ కోర్సులను పట్టించుకోరు. కానీ, ఇవే త్వరగా ఉపాధి పొందేందుకు సోపానాలు అని తెలుసుకోవడం లేదు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు పూర్తి అయ్యాయి. ఈ నేపథ్యంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపే వారికి మంచి అవకాశాలుంటాయి. ఇప్పటికే ఈ కోర్సులో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నవారు ఈ నెల 30వ తేదీన పరీక్షకు సన్నద్ధమవుతున్నారు. ర్యాంకు వచ్చిన బాలికలు పలమనేరు, నెల్లూరులోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలల్లోని కొన్ని కోర్సులు చేస్తే 19 ఏళ్లకే షార్‌లో ఉద్యోగం సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

డీసీసీపీ అంటే ఏమిటి?

డీసీసీపీ.. కామర్స్‌తోపాటు పూర్తిస్థాయి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని నేర్పే మూడేళ్ల డిప్లొమా కోర్సు. ఇందులో కామర్స్, డిగ్రీ మొదటి సంవత్సరం ఇంగ్లిష్, ఇంగ్లిష్ షార్ట్‌హ్యాండ్, హయ్యర్, మోడరన్ ఆఫీస్ మేనేజ్‌మెంట్, బిజినెస్ కరస్పాండెన్స్, స్టాటిటిక్స్, బిజినెస్ లా, మార్కెటింగ్ ప్రిన్సిపుల్స్, అనలటికల్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, డీటీపీసీ, టాలీ ప్రోగ్రామింగ్స్ ఉంటాయి. కోర్సులో ఏడాది అప్రెంటిస్‌షిప్ తర్వాత ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్‌గా విస్తృత అవకాశాలున్నాయి. కోర్సు పూర్తి చేసిన వారు బీకాం కంప్యూటర్స్ డిగ్రీలో లేటరల్ అడ్మిషన్ కింద సెకండ్ ఇయర్‌లో చేరవచ్చు. ఆపై ఎంబీఏ, సీఏ, సీఎస్ లాంటి ఉన్నత కోర్సులు చదవచ్చు.

- తల్లిదండ్రులు ఇలాంటి కోర్సులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

ఎస్వీయూ రీజియన్‌లో..

శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో మొత్తం 84 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. వీటిలో 26 ఇంజినీరింగ్ కోర్సుల్లో 85 వేల సీట్లు ఉన్నాయి. ప్రతి కోర్సులో 60 సీట్లు ఉంటాయి. కోర్ బ్రాంచ్‌లు పోగా స్పెషల్ కోర్సులుగా కళాశాలల ఆధారంగా ఐటీ, బయో మెడికల్, షుగర్ టెక్నాలజీ, లెదర్ టెక్నాలజీ, టెక్స్‌టైల్స్ అండ్ గార్మెంట్స్, సిరామిక్, ఆర్కిటెక్చర్, మెటాలజీ తదితర కోర్సులున్నాయి.

- విద్యార్థినులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండే డీసీసీపీ నెల్లూరు, పలమనేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మాత్రమే అందుబాటులో ఉంది.

షార్‌లో ట్రైనింగ్.. ప్రొఫైల్ చూసి అసెంచూర్‌లో జాబ్



పలమనేరులోని పాలిటెక్నిక్ కళాశాలలో డీసీసీపీ కోర్సు చదివి శ్రీహరికోటలో ఏడాది పాటు అప్రెంటిస్‌షిప్ చేశా. నా ఈ ప్రొఫైల్ చూడగానే ఇంటర్వ్యూలోబెంగళూరులోని అసెంచూర్ సంస్థలో ఉద్యోగం దక్కింది. పీ2పీ (ప్రొక్యూర్‌మెంట్ టు పే న్యూ అసోసియేషన్)గా మంచి ప్యాకేజీతో జాబ్ చేస్తున్నా. పలమనేరులో ఇలాంటి కోర్సులున్నాయని చాలామందికి తెలియదు.

– హేమావతి, బెంగళూరు

బాలికలకు ప్రత్యేక పాలిటెక్నిక్

చిత్తూరు జిల్లా పలమనేరు, నెల్లూరులో ప్రత్యేకించి మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. వీటిలో డిప్లొమా ఇన్ కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ (డీసీసీపీ) కోర్సు చేసినవారు ఏటా తిరుపతి జిల్లా శ్రీహరికోట షార్‌లో కంప్యూటర్ అనలిస్ట్‌గా అప్రెంటిస్‌షిప్‌నకు ఎంపికవుతున్నారు.

- షార్‌లోనే కాక ఎన్ఆర్ఎస్‌సీ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, హైదరాబాద్) హెచ్ఏఎల్ (హిందూస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్) వంటి పేరుగాంచిన కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు పొందుతున్నారు.
- వీటిలో అప్రెంటిస్‌షిప్‌తో నైపుణ్యం సాధించిన వారికి ప్రైవేట్ రంగంలోని ప్రముఖ కంపెనీలు భారీ వేతనాలను ఆఫర్ చేస్తున్నాయి.
- పలమనేరులోని కళాశాలలో డీసీసీపీ కోర్సు పూర్తి చేసుకున్న 90 శాతం మందికి ఏటా వెంట నే ఉపాధి లభిస్తోంది. పదేళ్లలో వివిధ కోర్టులు, రాష్ట్ర సచివాలయం, పోస్టల్, ప్రైవేటు బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో 400 మంది దాక ఉద్యోగాలు పొందడం విశేషం.

టెన్త్ తర్వాత మంచి కోర్సు



పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాలిసెట్ ర్యాంకు ఆధారంగా పలు కోర్సుల్లో చేరే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో చక్కటి ఉపాధి అవకాశాలు ఉన్నాయి. పేద, మధ్యతరగతి పిల్లలకు పాలిటెక్నిక్ విద్య ఎంతో మేలు. తద్వారా బీటెక్‌లోనూ ప్రవేశించి ఉన్నత విద్య అభ్యసించవచ్చు.

– డా.బెహరా శ్రీనివాస్, ప్రిన్సిపల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పలమనేరు

ఇక్కడ చదివితే జీవితంలో సెటిల్



కోర్ బ్రాంచ్‌లే కాదు స్పెషల్ బ్రాంచ్‌ల్లో చదివినవాళ్లు మంచి ఉపాధి అవకాశాలను పొందవచ్చు. డీసీసీపీ కోర్సు చేసిన చాలా మంది షార్ లాంటి గొప్ప సంస్థల్లో ఉద్యోగాల్లో ఉన్నారు. కొందరు ఉన్నత చదువులకు వెళుతున్నారు. పాలిటెక్నిక్‌లోని ఇలాంటి కోర్సుల గురించి చాలామందికి తెలియదు.

– మహమూద్, సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ హెడ్, పలమనేరు

ఏటా పది మందిపైనే షార్‌లో శిక్షణకు..



ఏటా షార్‌కు ఇక్కడినుంచి పదిమంది పైగా విద్యార్థినులు శిక్షణకు వెళుతున్నారు. ఆపై ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఈసారి సైతం ఇక్కడ చదివిన సిమ్రాన్ (సదుం), డిల్లీ (బంగారుపాళెం), శశిప్రియ (నిమ్మనపల్లి), భవాని (గుడుపల్లి) పలువురు షార్‌లో పనిచేస్తున్నారు.

– శ్రీవిద్య, డీసీసీపీ డిపార్ట్‌మెంట్ హెడ్, పలమనేరు

గుర్తుతెలియని వాహనం ఢీ.. యువకుడికి తీవ్ర గాయాలు

చంద్రగిరి : గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు తీవ్ర గాయాలపాలైన ఘటన శుక్రవారం రాత్రి మదనపల్లి–తిరుపతి జాతీయ రహదారి భాకరాపేట కనుమలో చోటు చేసుకుంది. ప్రయాణికుల వివరాల మేరకు.. సుమారు 25 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని యువకుడు శుక్రవారం రాత్రి తన ద్విచక్ర వాహనంలో భాకరాపేట నుంచి తిరుపతికి వెళ్తుండగా పెద్ద మలుపు వద్ద గుర్తు తెలియని కారు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అటుగా వస్తున్న తోటి ప్రయాణికులు గుర్తించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న అంబులెన్స్ క్షతగాత్రుడిని తిరుపతి రుయాకు తరలించారు. అయితే యువకుడు భాకరాపేట పరిసర ప్రాంతానికి చెందిన ట్లుగా తెలిపారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు.



తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని యువకుడు

నాయుడుపేటలో చోరీ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని మంగపతి నాయుడు నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంటిలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మంగపతినాయుడు నగర్లో నివాసం ఉంటున్న బందిలి కస్తూరయ్య, అతని భార్య మేనకూరు సెజ్‌లోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నారు. వారు గురువారం ఉదయం ఇంటికి తాళాలు వేసి విధులకు వెళ్లిపోయారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తలుపులకు వేసిన తాళాలు పగులగొట్టి వున్నాయి. లోనికి వెళ్లి పరిశీలించంగా బీరువాలో ఉంచిన 5 సవర్లకు పైగా బంగారు నగలు చోరీకి గురైనట్టు గుర్తించారు. కస్తూరయ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బొలెరో ఢీకొని ముగ్గురికి గాయాలు

నాయుడుపేట టౌన్ : మండలంలోని పండ్లూరు సమీపంలో శుక్రవారం రాత్రి ఆటోను బొలెరో వాహనం ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పండ్లూరు వెంగమాంబపురం గ్రామానికి చెందిన సుంకర చెంచురత్నం, చల్లా వెంకటకృష్ణయ్య, నట్టేటి సుబ్బారాయులు ఆటోలో నెల్లూరు వైపు వెళుతున్నారు. పండ్లూరు గ్రామం దాటిన తర్వాత వేగంగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. గాయపడిన ముగ్గురిని స్థానికులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి వైద్యులు గూడూరు ఏరియా వైద్యశాలకు పంపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటి గుంతలో పడి విద్యార్థిని మృతి



మృతి చెందిన శ్రీవల్లి (ఫైల్)

వరదయ్యపాళెం: పశువుల కాపరిగా వెళ్లిన ఇంటర్ విద్యార్థిని ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి దుర్మరణం చెందిన ఘటన మండలంలోని కువ్వాకొల్లి పంచాయతీ, లక్ష్మీపురం.కే గ్రామంలో విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు.. లక్ష్మీపురం.కే గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, కామేశ్వరి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె శ్రీవల్లి (16) గూడూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ చదువుతోంది. ఇటీవల ఫలితాల్లో ఆ విద్యార్థిని 345 మార్కులతో పాసైంది. గురువారం తమ పశువులను మేతకు తీసుకెళ్లింది. అయితే గ్రామ సమీపంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గత ఏడాది పనులు చేపట్టారు. దీంతో ఆ ప్రాంతంలో లోతైన గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతల్లో నీరు నిల్వ చేరడంతో పశువులు ఆ గుంతల్లోకి దిగగా వాటిని బయటకు తోలేందుకు అటుగా వెళ్లిన విద్యార్థిని శ్రీవల్లి కాలుజారి గుంతలో పడిపోయింది. తల్లిదండ్రులు యువతి ఆచూకీ కోసం ఆ ప్రాంతమంతా గాలించారు. చీకటి పడడంతో విద్యార్థిని ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం నీటి గుంతలో శవమై తేలి ఉండడాన్ని స్థానికులు గుర్తించడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే విద్యార్థిని కుటుంబాన్ని పరామర్శించి, తల్లిదండ్రులను ఓదార్చారు.

యువకుడి ఆత్మహత్య

వాకాడు: మండలంలోని వెంకటరెడ్డిపాళెంకు చెందిన యువకుడు విషపు గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చెరుకూరు రామారావు(35) భార్య వివిధ కారణాలతో పిల్లలను తీసుకుని రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. రామారావు పలుమార్లు పిలిచినా భార్య కాపురానికి రాలేదు. దీంతో మనస్తాపం చెందిన అతను గురువారం రాత్రి విషపు గుళికలు తిన్నాడు. అస్వస్థతకు గురైన అతన్ని కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఒక ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ

- వ్యక్తికి తీవ్ర గాయాలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలం కేఎల్ఎం హాస్పిటల్ కూడలిలో శుక్రవారం రాత్రి తమిళనాడుకు చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తుండగా లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనలో లారీ డ్రైవర్ పరారు కాగా లారీని, క్లీనర్‌ను అదుపులోకి తీసుకొని రేణిగుంట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గాయాలైన వ్యక్తిని విమానాశ్రయం సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

టీటీడీకి పది టన్నుల కూరగాయలు

పలమనేరు: పట్టణానికి చెందిన మార్కెట్ మండీ యజమాని ఓకేఆర్ రెడ్డెప్పరెడ్డి టీటీడీ నిత్యాన్నదాన సత్రానికి పది టన్నుల వివిధ రకాల కూరగాయలను టీటీడీ ప్రత్యేక వాహనంలో స్థానిక మార్కెట్ నుంచి శుక్రవారం పంపించారు. ఈ సందర్భంగా ఆ వాహనంలో కూరగాయలు నింపి, పూజలు చేసి, గోవిందనామ స్మరణల నడుమ వాహన్నాన్ని తిరుమలకు పంపారు. ఇందులో స్థానిక శ్రీవారి సేవకుడు కాబ్బల్లి రవీంద్రారెడ్డితోబాటు ఆయన మిత్రబృందం పాల్గొన్నారు.

కాణిపాకంలో పోటెత్తిన భక్తులు



కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు పోటెత్తారు, సెలవు దినం కావ డంతో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. ఉచిత, శీఘ్ర, అతి శీఘ్రదర్శనంతో పాటు వీఐపీ దర్శన క్యూలు భక్తులతో కిటకిటలాడాయి. దర్శన ఏర్పాట్లను ఆలయాధికారులు పర్యవేక్షించారు.

ప్రబంధకారణి కమిటీ ఎంపిక

శ్రీకాళహస్తి: పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో నూతన ప్రబంధకారిణి కమిటీని శుక్రవారం ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడు గల్లా సురేష్, కార్యదర్శి రవికుమార్ పాఠశాల నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. కమిటీ మూడేళ్ల పాటు కొనసాగుతుందన్నారు. పాఠశాల అభివృద్ధికి ఈ కమిటీ సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు మంగిరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఉమాశంకర్, ప్రకాష్, సోమశేఖర్‌రెడ్డి, పద్మావతి, పుష్పలత, డాక్టర్ లక్ష్మినారాయణ, రాజేష్, నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు, మాతాజీ (ఉపాధ్యాయులు) పాల్గొన్నారు.